క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కందుకూరు అర్బన్ : ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రి పాలెం గ్రామానికి చెందిన జిల్లెళ్లమూడి లక్ష్మమ్మకు రూ.20వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య, తరగతి ప్రజలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్‌ఫండ్ వరంలా మారిందన్నారు. ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని తెలిపారు.

రేపు ఆసరా చెక్కుల పంపిణీ

కందుకూరు: డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీ సోమవారం పట్టణంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో జరుగుతుందని ఏపీఎం శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. కావున పొదుపు సంఘాల మహిళలు, అధికారులు పాల్గొనాలని కోరారు.

రూ 9.లక్షలతో ఇంటింటికీ కుళాయి

హనుమంతునిపాడు: దాసరిపల్లి దళితవాడలో జలజీవన్ మిషన్ నిధులతో కాలనీ ప్రజల తాగునీటి సమస్య తీరిందని సర్పంచ్, వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్టారెడ్డి అన్నారు. శనివారం ఆయన గ్రామంలో ఏర్పాటు చేసిన కుళాయి పనులు, డీప్ బోరు నీటిని వదలి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.9లక్షల జలజీవన్ నిధులతో కాలనీలో డీప్ బోరు ఏర్పాటు, పైప్‌లైను, ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. .

రైతులకు ప్రభుత్వ పథకాలు అందించండి

సింగరాయకొండ: స్థానిక మండల కాంప్లెక్స్‌లోని ఆర్‌బీకేలో సబ్ డివిజన్‌లోని మండల వ్యవసాయాధికారులతో ఏడీఏ నిర్మలకుమారి ప్రభుత్వ పథకాల అమలుపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. పంట నమోదు చేయాలని, ఎరువులు, పురుగుమందులు రైతులకు సకాలంలో అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారులు కె.వి.శేషారెడ్డి, యుగంధర్‌రెడ్డి, రాము, పూర్ణచంద్రరావు, విజయ్, శశికళ పాల్గొన్నారు.

పొగాకు రైతులు వర్షాలకు జాగ్రత్తగా ఉండాలి

టంగుటూరు: పొగాకు రైతులు అకాల వర్షాలకు జాగ్రత్తగా ఉండి టార్పాలిన్ పట్టలు సిద్ధంగా ఉంచుకోవాలని, గ్రేడింగ్, క్యూరింగ్ సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో జమ్ములపాలెం, తుమాడు గ్రామాలకు చెందిన రైతులు 861 బేళ్లను వేలానికి తీసుకురాగా, వాటిలో 791 కొనుగోలు జరిగాయి. 46 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.200 పలకగా, కనిష్ట ధర రూ.170 పలికింది. సరాసరి రూ.196.66 పలికింది. వేలంలో మొత్తం 14 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

400 మందికి పరీక్ష ప్యాడ్ల పంపిణీ



ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

గుడ్లూరు (కందుకూరు): ఎర్రన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 1989–90 ఏడాది పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు మండలంలోని 9 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల 400 మంది 10వ తరగతి విద్యార్థులకు శనివారం పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎర్రన వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు టీపీ మాలకొండయ్య, ప్రధానకార్యదర్శి సోమానాయుడు, సభ్యులు నాగరాజు, ఆంజనేయులు, తిరుమలరావు, రాజేశ్వరి, విజయ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు

- పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి
- అధికారులు బాధ్యతతో పనిచేయాలి
- సచివాలయాలను నేనే అకస్మికంగా తనిఖీ చేస్తా
- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: మున్సిపల్ పాలకులు, అధికారులు, సిబ్బంది అందరూ ప్రణాళికాబద్ధంగా పనిచేసినప్పుడే పట్టణ ప్రగతి ప్రజల్లోకి వెళ్తుందని టీటీడీ పాలకమండలి సభ్యుడు, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. శనివారం చైర్మన్ గఫార్ ఛాంబర్‌లో కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వార్డుల వారీగా సమస్యలు, వాటి పరిష్కార చర్యలు, పెండింగ్ పనులు, వార్డుల్లో తక్షణం చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో జరిగిన ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందచేయాలన్నారు. ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకూడదని తెలిపారు. పట్టణంలో రూ.130 కోట్లతో సమగ్ర మంచినీటి పథకం పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలో ఇంటింటికి సాగర్ నల్లా అందిస్తామన్నారు. అలాగే రూ.15కోట్లతో మురికినీటి శుద్ధీకరణ ప్లాంటేషన్ పనులు జరుగుతున్నాయని, సుమారు 7.కోట్లతో ఇప్పటికే పట్టణంలోని సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు చేపట్టినట్లు వివరించారు. పెండింగ్, పురోగతిలో ఉన్న పనుల గురించి మున్సిపల్ పాలకులు, అధికారులు ఎప్పటికప్పుడు సమష్టిగా చర్చించుకుని అభివృద్ధిని వేగవంతంగా చేసుకోవాలన్నారు. పట్టణ అభివృద్ధికి ఎటువంటి సహాయ, సహకారాలు కావాలన్నా తాను సంపూర్ణంగా అందిస్తానని వెల్లడించారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ పెట్టండి

పెరిగిన పట్టణ విస్తీర్ణం దృష్ట్యా పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక ప్రణాళికా చర్యలు చేపట్టాలని కమిషనర్ డీవీఎస్ నారాయణరావును ఆదేశించారు. ప్రజా సమస్యలపై తక్షణం స్పందించని సచివాలయ సిబ్బంది జాబితాను సిద్ధం చేయాలన్నారు. మున్సిపల్ సిబ్బంది, అధికారులు పద్ధతి మార్చుకుని బాధ్యతగా పనిచేయాలని హెచ్చరించారు. చిన్న చిన్న సమస్యలకు ప్రజలను కార్యాలయాల చుట్టు తిప్పుకోవద్దని తెలిపారు. పారిశుధ్యం అధ్వాన్నంపై ప్రజల నుంచి తనకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మున్సిపాలిటీలో రెగ్యులర్ ఏఈని నియమించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానన్నారు. వార్డుల్లో జరిగే పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలను, సచివాలయాలను తానే స్వయంగా అకస్మికంగా తనిఖీ చేస్తానని ఎమ్మెల్యే బుర్రా వెల్లడించారు. పారిశుధ్య పనులు చేసే కార్మికులనే అదనంగా తాత్కలిక విధుల్లోకి తీసుకోవాలన్నారు. సచివాలయాలను కూడా అకస్మికంగా తనిఖీ చేస్తానని చెప్పారు.

మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్, మాణిక్యరావు, కౌన్సిలర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, దేవకి సత్యావతి, పసుపులేటి దీప, పాతిరెడ్డి రాజారెడ్డి, దేవరాజ్, దేవకి రాజీవ్, పెన్నా ఏడుకొండలు, దాసరి మురళీ, రామనబోయిన శ్రీను, తిరుపతయ్య, పులి శ్రీనివాసులరెడ్డి, నక్కా రామకృష్ణా, కోఆప్షన్ సభ్యులు అబ్రహం లింకన్, ఎస్‌కే ఖాజామొహిద్దీన్, చింతం శ్రీనివాసులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బాదం సత్యన్నారాయణ మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరమ్మ ఆలయం వద్ద దుకాణాలకు వేలం రేపు

టంగుటూరు: మండలంలోని వల్లూరులో గల వల్లూరమ్మ ఆలయం వద్ద న్యూ షాపింగ్ కాంప్లెక్సులోని దుకాణాలకు ఈ నెల 27వ తేదీ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు 7, 9 నంబర్ల షాపులకు విడివిడిగా టెండర్, బహిరంగ వేలాన్ని దేవదాయ, ధర్మాదాయ అధికారులు, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని ఈవో కోరారు.

కస్తూర్బా పాఠశాలలో చేరేందుకు దరఖాస్తులు

మద్దిపాడు: మండలంలోని రావిళ్లవారిపాలెం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకు బాలికలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే సీతాబాయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు మండలంలో బడి మానేసిన పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

గుడ్లూరు(కందుకూరు): మండలంలోని ఏలూరుపాడు, చేవూరు, మోచర్ల గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న గృహ నిర్మాణాలను మండల ప్రత్యేకాధికారి, మైనింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ సూర్యచంద్రరావు శనివారం పరిశీలించారు. మూడు గ్రామాల పరిధిలో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల కింద చేవూరులో 145 గృహాలకు గాను 82, ఏలూరుపాడులో 61 గృహాలకు గాను 32, మోచర్లలో 83 గృహాలకు 39 గృహాలు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. నిర్మాణంలో వాటి పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, లబ్ధిదారులకు నిర్మాణాలకు అవసరమైన అన్ని మెటీరియల్స్ ప్రభుత్వం సకాలంలో అందిస్తుందని చెప్పారు. లబ్ధిదారులు పనులు వేగవంతం చేసి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ సూర్యనారాయణసింగ్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, జయమ్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

మద్దిపాడు: మద్దిపాడు కొండప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న పొదిలి సెబ్ పోలీసులు సిబ్బందితో ఆకస్మికంగా దాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,300 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వాహనాలతో పాటు పేకాట రాయుళ్లను మద్దిపాడు ఎస్‌ఐ పీ అంకమ్మరావుకు అప్పగించారు. సోమవారం పొదిలి జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరచనున్నట్లు ఎస్సై అంకమ్మరావు తెలిపారు.

పాలేటి గంగమ్మకు ప్రత్యేక పూజలు



గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

పీసీపల్లి(కనిగిరి రూరల్): పీసీపల్లి మండలంలోని పెద అలవలపాడు వద్ద ఉన్న పాలేటి గంగమ్మతల్లిని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ శనివారం దర్శించుకున్నారు. ఎంతో నియమ నిష్టలతో ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెన్నా వెంకటేశ్వర్లు, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీకృష్ణా, జెడ్పీటీసీ మేకల శ్రీను, వేల్పుల వెంకటేశ్వర్లు, దాసరిమురళీ, రామనబోయిన శ్రీనివాసులు, పెన్నా ఏడుకొండలు, మహేష్ నాగ్, దేవర వెంకటేశ్వర్లు, కొలగాని సుబ్బయ్య, దేవర వెంకటేశ్వర్లు, మాలీ యాదవ్, నాలీ, బొడ్డుబోయిన శ్రీను, ప్రసాద్, రవి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

500 కుళాయి కనెక్షన్లు కట్



బకాయిదారులతో మాట్లాడుతున్న కమిషనర్

కందుకూరు అర్బన్: మున్సిపాలిటీకి బకాయి ఉన్న పన్నులు చెల్లించాలని పదేపదే కోరినా స్పందించని వారి కుళాయి కనెక్షన్లు సుమారు 500 తొలగించినట్లు కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలో ప్రజలకు వడ్డీ మాఫీ పై అవగాహన శనివారం కలిగించారు. కమిషనర్ మనోహర్ మాట్లాడుతూ పన్నులు వడ్డీ మాఫీతో చెల్లించడానికి ఇంకా 6 రోజుల మాత్రమే గడువు మిగిలి ఉందని, పన్నుల బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పన్నులు కట్టించుకోవడానికి మున్సిపాలిటీ కార్యాలయంలో ఆదివారం కౌంటరు తెరచి ఉంటుందని తెలియజేశారు. శనివారం ఒక్కరోజే రూ.6 లక్షల పన్నుల బకాయిలు వసూలైనట్లు చెప్పారు. ఈ నెల 31 తేదీ నాటికి పన్నులు చెల్లించి మున్సిపాలటీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



ఆర్డీఓను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: ప్రజలకు మెరుగైన సేవలందించి, రెవెన్యూ సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. నూతనంగా కనిగిరిలో బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ టి. అజయ్‌కుమార్ శనివారం స్థానిక వైఎస్సార్ భవన్‌లో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్చం అందచేసి సన్మానించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆర్డీఓను సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, ఎంపీపీ ప్రకాశం, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, మాజీ ఎంపీపీ పాతు కొండారెడ్డి, వేల్పుల వెంకటేశ్వర్లు, పెన్నా ఏడుకొండలు, రామనబోయిన శ్రీనివాసులు, కౌన్సిలర్లు ఉన్నారు. అలాగే మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓను కలిసి సన్మానించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కనిగిరి రూరల్: స్థానిక వైఎస్సార్ భవనలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పంపిణీ చేశారు. రంగనాయకులరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నారపరెడ్డిపల్లికి చెందిన పెన్నా సుబ్బారెడ్డికి రూ. నాల్గు లక్షల, పామూరుకు చెందిన ఇద్దరికి రూ. 68వేల చెక్కులను అందచేశారు.

ఉరుములు, మెరుపులతో భారీవర్షం



అకాల వర్షానికి నీటమునిగిన పంటలు

హనుమంతునిపాడు: మండల పరిధిలో ఉరుములు మెరుపులు, గాలులతో భారీ వర్షం కురిసింది. వెంగపల్లి, కొత్తమల్లవరం, ఆవులవారిపల్లి, చిన్న మల్లవరం, తిమ్మారెడ్డిపల్లి, నల్లగండ్ల గ్రామాల్లో సాయంత్రం కురిసిన వర్షానికి సాగులో పంటలన్నీ నీట మునిగాయి. మల్లవరంలో దేవిరెడ్డి శివారెడ్డి 5 ఎకరాల్లో సాగు చేసిన కరబుజా పంట నీటముగింది. హనుమంతునిపాడు, నీలకంఠాపురం, ఎలికవారిపల్లి, మల్లవరం గ్రామాల్లో సాగులో ఉన్న మిరపకాయలు తడిసినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షంతో పుచ్చ, కరబుజా, మిరప తోటల రైతులకు నష్టం వాటిల్లినట్లు రైతులు శివారెడ్డి, నారాయణరెడ్డి, రామిరెడ్డిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్



బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం, సర్పంచ్

పామూరు: విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్ పొందాలని వీరభద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.సుబ్బారెడ్డి, సర్పంచ్ పువ్వాడి జయమ్మ అన్నారు. మండలంలోని వీరభద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌యం, సర్పంచ్‌లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగడంతోపాటు లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్యసాధనకోసం కృషిచేయాలన్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు పేరుప్రతిష్టలు తేవాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామానికి చెందిన పువ్వాడి వెంకటేశ్వర్లు చట్టుమడుగు, దాదిరెడ్డిపల్లె గ్రామాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు నిత్యం ఆటో సౌకర్యం కల్పిస్తామన్నారు.

అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పువ్వాడి వెంకటేశ్వర్లు, పువ్వాడి రామారావు, పీఎంసీ చైర్మన్ రాచగొర్ల ఆదిలక్ష్మి, ఎ.వి.సుబ్బరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనానికి విద్యార్థిని ఎంపిక

పొన్నలూరు: మండలంలోని ముండ్లమూరివారిపాలెం జెడ్పీ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని అనుమోలు మణిపవిత్ర నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం బి.మాధవరావు శనివారం తెలిపారు. ఇటీవల జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ పరీక్ష రాసిన మణిపవిత్ర ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ఉపకార వేతనానికి అర్హత సాధించినట్లు చెప్పారు. ఆమె చదువు నిమిత్తం ప్రభుత్వం రూ.48,000 అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

పామూరు: మెరుగైన పారిశుధ్యంతో స్వచ్ఛగ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న స్వచ్ఛసంకల్పం అమలు చేస్తుందని కనిగిరి డీఎల్‌పీఓ శోభన్‌బాబు అన్నారు. స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో శనివారం కనిగిరి, కొనకనమిట్ల మండలాల క్లాప్‌మిత్రలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌పీఓ శోభన్‌బాబు మాట్లాడుతూ ప్రజల సహకారంతో క్లాప్‌మిత్రలు తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి సేకరించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో క్లాప్‌మిత్రలు అంకితభావంతో పని చేసి కేంద్రం ఆర్థికంగా వృద్ధి చెందేందుకు కృషిచేయాలన్నారు. ఎంపీడీఓలు జనార్దన్, ఎంపీడీఓ మల్లికార్జునరావు, ఈఓఆర్డీ బ్రహ్మానందరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రత్నకుమార్, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ గాయం సావిత్రి, ఎంపీడీఓ

హనుమంతునిపాడు: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీపీ గాయం సావిత్రి, ఎంపీడీఓ జీవీ క్రిష్టారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు, మహిళా పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు పని చేసే ఇష్టం లేకుంటే రాజీనామా చేసి వెళ్లవచ్చన్నారు. పనిచేసే ఇంకో నిరుద్యోగికి అవకాశం కల్పిస్తామని చెప్పారు. వలంటీర్లు బాధ్యతగా పనిచేయడం లేదని, అందుబాటులో ఉండటం లేదన్నారు. పనులు సక్రమంగా చేయని సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ లక్ష్యం నేటికి పూర్తి చేయలేదన్నారు. బాధ్యతగా పని చేయని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీపీ గాయం సావిత్రి, ఎంపీడీఓ జీవీ క్రిష్టారావు, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, పంచాయతీ విస్తరణ అధికారి షేక్ షరీఫ్, మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, మాజీ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, ఏరువ వెంకటరెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అనుమతి మేరకే బేళ్లను తీసుకురావాలి



పొగాకు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఎం లక్ష్మణరావు

కనిగిరి రూరల్: రైతులు అనుమతి ఇచ్చిన మేరకే పొగాకు బేళ్లను కేంద్రాలకు తీసుకురావాలని బోర్డు ఆర్‌ఎం ఎం లక్ష్మణరావు అన్నారు. స్థానిక వేలం కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ప్రస్తుతం మార్కెట్ విలువ బాగా ఉన్నందున రైతులు బేళ్లను విక్రయించుకోవాలని తెలిపారు. క్లస్టర్‌కు పరిధిలో అనుమతి పొందిన పొగాకు బేళ్లను బ్యారీన్ల వారీగా తెచ్చుకోవాలన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి పొగాకు సూరను కూడా బోర్డును కొనుగోలు చేస్తుందన్నారు. సూర పొగాకును కూడా బేళ్లుగా కట్టి తీసుకురావాలని సూచించారు. ఇనిమెర్ల క్లస్టర్ నుంచి 353 బేళ్లు రాగా 329 బేళ్లు కొనుగోలు చేసి 24 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.200, కనిష్ట ధర రూ.171, సరాసరి రూ.197.69 పలికినట్లు కేంద్రం ఇన్‌చార్జి బి.కోటేశ్వరరావు తెలిపారు.

రైతు సదస్సులో పాల్గొన్న నేతలు



మాట్లాడుతున్న సూరసాని మోహన్‌రెడ్డి, వేదికపై రైతు సంఘ రాష్ట్ర నాయకులు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర సదస్సులో కనిగిరికి చెందిన పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కన్వీనర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం తాడేపల్లిలోని పార్చున్ గ్రాండ్ భవన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సూరసాని మోహన్‌రెడ్డి పార్టీ రాష్ట్ర నాయకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని, ఎంవీఎస్ నాగిరెడ్డిని, రైతు విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు. తొలిసారి జరిగిన రాష్ట స్థాయి సమావేశంలో పాల్గొన్న రైతు విభాగం ప్రకాశం జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో రైతు సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌బీకే కేంద్రాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు.

గాలికుంటు వ్యాధి టీకాలతో పశువులకు ఆరోగ్యం



టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వరికూటి అశోక్‌బాబు, జేడీ బేబీరాణి

టంగుటూరు: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం వలన పశువులు ఆరోగ్యంగా ఉంటాయని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి అన్నారు. టంగుటూరులోని రావి వెంకటేశ్వర్లు పశువుల డైరీలో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి చేతుల మీదగా గాలికుంటు వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టంగుటూరు మండలంలోని అన్ని గ్రామాల్లో పశువుల చెంతకు వచ్చి పశువైద్య సిబ్బంది నాలుగు నెలలు పైబడిన దూడల నుంచి అన్ని వయసుల గేగెలు, తెల్ల పశువులకు అందిస్తారన్నారు. ఏడీ సుధీర్‌బాబు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం టంగుటూరు, జరుగుమల్లి మండలాల్లో అన్ని గ్రామాల్లో టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు కాలేషా, రమేష్, టీవీ రమేష్, పశుసంవర్ధకశాఖ సిబ్బంది, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుటా వెంకట్రావు, సీనియర్ నాయకులు బీసీడి ఉదయకుమార్, సూదనగుంట వెంకటస్వామి, రావి వెంకటేశ్వర్లు, మక్కెన వెంకయ్య పాల్గొన్నారు.

జరుగుమల్లి (సింగరాయకొండ): పశుపోషకులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి ఎం.అరుణ సూచించారు. జరుగుమల్లి పశువైద్యశాలలో శనివారం గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఆమె లాంఛనంగా ప్రారంభించారు.

కందుకూరు రూరల్: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా ప్రభుత్వం టీకాలు పంపిణీ చేస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలోని పశుసహాయకుల ద్వారా పశువులకు ఉచితంగా ఈ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేస్తామన్నారు.

వైఎస్సార్ ఆసరా కింద రూ.8.65 కోట్లు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని డ్వాక్రా గ్రూపులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.8.65 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఏపీఎం భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో 948 గ్రూపులుండగా 9,275 మంది మహిళలు ఈ పథకం కింద లబ్ధిపొందనున్నారు. వీరందరి బ్యాంకు ఖాతాల్లో త్వరలో రుణమాఫీ నగదు మొత్తం జమవుతుందని తెలిపారు. శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన 3వ విడత ఆసరా పథకం కార్యక్రమాన్ని డ్వాక్రా మహిళలు ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేలలో కూర్చుని టీవీల ద్వారా తిలకించారు.

సింగరాయకొండలో...

సింగరాయకొండ మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద 1,292 డ్వాక్రా గ్రూపుల్లోని 12,545 మంది మహిళలు రూ.10.08 కోట్ల మేరకు లబ్ధి పొందనున్నట్లు ఏపీఎం డి.జయరాజ్ తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాలు అందించాలి

పొన్నలూరు: గ్రామాల్లో సంవత్సరంలోపు చిన్నారులు, గర్భిణులకు నూరు శాతం వ్యాధి నిరోధక టీకాలు అందించాలని జిల్లా కుష్టు, క్షయ, ఎయిడ్స్ వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ అన్నారు. పొన్నలూరు, పైరెడ్డిపాలెం, పాతశింగరబొట్లపాలెం గ్రామాల్లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం పరిశీలించి సూచనలు చేశారు. జిల్లాలో ఇప్పటికే గుర్తించిన 1765 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా వైద్యసేవలు అందిస్తోందన్నారు. పొన్నలూరు మండలంలో ఎనిమిది మంది క్షయ వ్యాధి సోకిన వారికి చికిత్స అందిస్తున్నామన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ కీర్తి, డీపీఎం వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో సుబ్బారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి ఇద్దరు వైద్యుల కేటాయింపు

సింగరాయకొండ: ప్రభుత్వ ఆస్పత్రికి కొత్తగా ఇద్దరు డాక్టర్లను ప్రభుత్వం కేటాయించినట్లు ప్రభుత్వ వైద్యాధికారి ఎం.చైతన్యకృష్ణ తెలిపారు. వీరిద్దరినీ పాకల పీహెచ్‌సీకి కేటాయించారని, ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చేంత వరకు స్థానిక పీహెచ్‌సీలో వీరు విధులు నిర్వహిస్తారని ఆయన వివరించారు. దీంతో ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ల సంఖ్య 4కు పెరిగినట్లు డాక్టర్ చైతన్యకృష్ణ వివరించారు.

1943 బేళ్ల కొనుగోలు

కందుకూరు: వేలంలో కందుకూరు-1వ వేలం కేంద్రంలో శనివారం 915 బేళ్లు వేలానికి ఉంచగా 865బేళ్లు, కందుకూరు-2వేలం కేంద్రంలో 1145 బేళ్లు వేలానికి ఉంచగా 1078 బేళ్లు విక్రయించారు. రెండు వేలం కేంద్రాల్లోను కేజీ పొగాకు అత్యధిక ధర రూ.200 లభించగా, అత్యల్ప ధర రూ.185, రూ.180 పలికింది.